ఒకే ట్రాక్టర్.. 16 వార్డులు


ఏటూరునాగారంలో చెత్తాచెదారం తీసుకెళ్తున్న జీపీ సిబ్బంది

- చెత్త సేకరణకు తప్పని ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: వేలాది జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీలో 16 వార్డులకు ఒకే ఒక్క ట్రాక్టర్ చెత్త సేకరణకు ఉండడంతో సేకరణ సరిగా జరగడం లేదు. సమయానికి ట్రాక్టర్ రాక ప్రజలు, చెత్తను సేకరించాలేక జీపీ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఏటూరు నాగారం మేజర్ గ్రామ పంచాయతీలో 16 వార్డులు, 24 వేల మంది జనాభా ఉన్నారు. ఈ జనాభా రోజుకు కనీసం పది క్వింటాల తడి, పొడి చెత్తను చెత్త కుండీల వద్ద పడవేస్తుంటారు. వాటిని సేకరించడానికి రెండు ట్రాలీ ట్రాక్టర్లు ఉండగా ఒక ట్రాక్టర్ ట్రాలీ తుప్పపట్టి మండల కేంద్రంలోని ఓ వెల్డింగ్ షాపు వద్ద మరమ్మతు కోసం పడవేసి ఉంది. మరో ట్రాక్టర్ గ్రామంలో చెత్తాచెదారం సేకరణకు తిరుగుతోంది. ఇలా చేయడం వల్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో తిరిగి చెత్తాచెదారం పూర్తవడం లేదు.


ముత్యాలమ్మ గుడి దగ్గర ఉన్న చెత్తాచెదారం

ఆరు నెలలుగా ట్రాలీ మరమ్మతు

మరమ్మతుకు గురైన ట్రాలీని రిపేరు చేయించేందుకు రూ.2లక్షలు అవసరం ఉండడంతో ఆరు నెలల నుంచి వెల్డింగ్ షెడ్డువద్దనే పడావుపడి ఉంది. గ్రామ పంచాయతీలో ఎలాంటి నిధులు లేకపోవడంతో ట్రాలీని రిపేరు చేయించడం లేదని గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. ట్రాలీ రిపేరు మాత్రమే కాకుండా బయట నల్లా రిపేర్లు, లైట్లు, ఇతర మరమ్మతులు, మెంటనెన్స్ కూడా గ్రామ పంచాయతీలో నిధులు లేక పనిచేయలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల రామాలయం వద్ద మిషన్ భగీరథ పైపులు పగిలిపోతే రామాలయం కమిటీ ద్వారా మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదని గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అధికారులు చెప్పడం విడ్డూరంగా మారింది. అయితే స్థానిక మండల అధికారులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ జిల్లాలో ఎలాంటి బడ్జెట్ లేదని, తాము ఏమిచేయలేమని చేతులు ఎత్తేసినట్లు తెలిసింది.

మా వీధికి రావడం లేదు


మాది 6వ వార్డు. చెత్తాచెదారం వేసేందుకు రోజుల తరబడి చూడాల్సి వస్తోంది. మా విధికి ట్రాక్టర్ రావడం లేదు. ఎందుకు రావడం లేదని జీపీ సిబ్బందిని ప్రశ్నిస్తే ఒక్క ట్రాక్టర్ ట్రాలీ ఉందని, ఇటు వైపు రావాలి అంటే వారానికి ఒకసారి వస్తామంటున్నారు. దీంతో చెత్తాచెదారం రోడ్లపై పేరుకుపోతోంది.

– వెంకటస్వామి, 6వ వార్డు

కోతులతో ఇబ్బంది


చెత్తాచెదారం నిల్వ చేసుకొని ఇంటి వద్ద నిల్వ పెడితే కోతులు వాటిని వీరంగా చేస్తున్నాయి. చెత్తాచెదారం వేద్దాము అంటే ట్రాక్టర్ సమయానికి రాదు. గంటల తరబడి చూడాల్సిన దుస్థితి ఉంది. ట్రాక్టర్ ట్రాలీ ఒకటి రెండు వార్డులు తిరిగే వరకు నిండిపోతుంది. దీనివల్ల మిగతా వార్డుల చెత్తాచెదారం వేసుకునేందకు రావాడానికి సమయం పడుతోంది.

– మంజుల, 8వ వార్డు

క్లుప్తంగా

కృష్ణప్రసాద్‌కు జాతీయ స్థాయి గుర్తింపు


గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన కోసరి కృష్ణ ప్రసాద్ ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఆర్‌డీఓ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న న్యూఢిల్లీలోని డీఆర్‌డీఓ భవన్‌లోని కోఠారి ఆడిటోరియంలో నిర్వహించే వేడుకల్లో ఆయనను ఘనంగా సత్కరించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని ఆర్‌సీఐ(రీసెర్చ్ సెంటర్ ఇమారత్)లో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణ ప్రసాద్ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు దేశానికి గౌరవం తీసుకురావడమే కాకుండా, స్వగ్రామం చల్వాయి పేరు దేశవ్యాప్తంగా మార్మోగేలా చేశాడు.

అంటరానితనం నేరం


వాజేడు: కుల వివక్ష తగదని అందరు సమానమేనని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామాల్లో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్ష పాటించవద్దని, అంటరానితనం నేరమన్నారు. ఏఎస్సై లతీఫ్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రేకాశ్రీ తదితరులు ఉన్నారు.

మిర్చి నారుమడులు ధ్వంసం


వెంకటాపురం(కె): మండల పరిధిలోని మరికాల గ్రామంలో మిర్చి నారుమడులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరికాల గ్రామ శివారులో ఎనిమిది మంది రైతులు మిర్చి నారు పోసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు రైతులు రమేష్, లింగయ్య, ఆనందమూర్తి, శివయ్యలకు చెందిన మిర్చి నారు మడులపై గడ్డి మందు చల్లడంతో నారు కుళ్లిపోతుంది. సుమారు నారు విలువ రూ.లక్ష యాభై వేలు ఉంటుంది. మిర్చి పంట నాటుకు నేందుకు సిద్ధంగా ఉన్న నారుపై గడ్డిమందు చల్లడంతో పూర్తి పనికి రాకుండా పోయిందని రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పరామర్శ


ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నల్లెల్ల భరత్‌కుమార్, సారయ్య, అభినయ్, లక్కి, రవీందర్, గోపి, ప్రవీన మల్లయ్య, జితేందర్, రాజు, సారయ్య, తదితరులు ఉన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి


చిట్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతో పాటు, పచ్చదనాన్ని పెంపొందించి విద్యార్థులకు ఆహ్లాదవాతావరణాన్ని కల్పించాలని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ ర్యాంకింగ్‌పై మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన అనుకూల వాతావరణాన్ని కల్పించాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ బెంచ్ మార్కులకు అనుగూనంగా మెరుగు పరిచేందుకు ఒక రేటింగ్ వ్యవస్థ పరిశుభ్రత, ఆకుపచ్చ పద్ధతుల రాయబారులుగా పిల్లలను తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతి, మహేందర్, శ్రీనివాస్, శ్రీలత, రవీందర్, ఎమ్మార్సీ సిబ్బంది హరీష్, నరేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కెలను జీపీగా ఏర్పాటు చేయాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మండలంలోని ఎక్కెలను ప్రత్యేక గ్రామపంచాయతీగా గుర్తించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కోరారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, జిల్లా నాయకుడు పోరిక గోవింద నాయక్, మండల నాయకులతో పాటు కలిసి కలెక్టర్ దివాకరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎక్కెల పరిధిలోని బూటారం, చింతలపాడు, గంటలగుంట గ్రామాలను కలుపుకొని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినట్లయితే ఈ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మంగపేట: మండలంలోని కమలాపురంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎర్రవాగు పొంగి ప్రవహించడంతో ముంపునకు గురై నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు బాధితులతో కలిసి కలెక్టర్ దివాకరకు వినతిపత్రాన్ని అందజేశారు. నష్టపోయిన బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, సఖినాల భవాని, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారావు

కాచి చల్లార్చిన నీటినే తాగాలి


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అశీష్

- వైద్యాధికారి అశీష్

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని మండల వైద్యాధికారి ఆశీష్ అన్నారు. శనివారం మండ పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కోటిరెడ్డి, స్వరూప, సరస్వతితో పాటు తదితరులు ఉన్నారు.

తప్పులుంటే సరిచేసుకోవాలి


కన్నాయిగూడెం: సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ సాజిదాబేగం, నాయకులు


వాజేడు: సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: ప్రభుత్వం విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటరు లిస్టులో ఎలాంటి తప్పులున్న సరి చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సాజిదా బేగం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు పార్టీ నాయకుల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్సర్, సుబ్బుల సమ్మయ్య, కిషోర్, వెంకటేష్, నాగేష్, సుమన్ పాల్గొన్నారు.

ఓటరు లిస్టుపై అభ్యంతరాల గడువు పెంచాలి

వాజేడు: ఓటరు లిస్టుపై అభ్యంతరాల గడువు పెంచాలని పలు పార్టీలకు చెందిన నాయకులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఓటరు లిస్టు అభ్యంతరాలపై వివిధ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులతో ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల–2025 సంవత్సరం ఓటరు జాబితాను వార్డుల వారీగా తయారు చేసినా అందులో ఒకే కుటుంబం ఒకే వార్డులో ఉందా, లేదా చూసుకోవడానికి సమయం లేకుండా పోయిందని పొడింగించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఓటరు లిస్టులు

మంగపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన 2025 ఓటరు జాబితాల్లో ఓటర్ల వివరాలు తప్పుల తడికగా ఉన్నాయని మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు గదిలో ఎంపీడీఓ భద్రునాయక్ ఆధ్వర్యంలో మండలంలోని 25 గ్రామ పంచాయతీలలోని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ తదితర రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మండలంలో 25 గ్రామ పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను వెల్లడించారు. ఓటరు జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న మహేందర్

గోవిందరావుపేట: రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చల్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులను ఉద్దేశించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. విత్తనాల చట్టం, పురుగు మందుల చట్టం, రైతుల సాగు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

నానో ఎరువులతో మేలు

మల్హర్: నానో ఎరువుల వాడకంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్రీజ అన్నారు. శనివారం మండలంలోని కొయ్యూరు గ్రామంలో రైతులకు నానోఎరువుల వాడకంపై, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ఏఓ అవగాహన కల్పించారు. నానో ఎరువులు ఆధునిక వ్యవసాయ రంగంలో ఒక విప్లవాత్మక ఆవిష్కరణ అని ఇవి సంప్రదాయ ఎరువుల మాదిరిగా కాకుండా, నానో టెక్నాలజీ ఆధారంగా తయారవుతాయన్నారు. ఈ ఎరువులు సాధారణంగా ద్రవ రూపంలో తయారు చేసి, పంట ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. నానో ఎరువులు మొక్కలకు అవసరమైన పోషకాలను సకాలంలో అందిస్తాయని తెలిపారు.

విద్యా విధానం పటిష్టానికి చర్యలు

కాటారం: అంగన్‌వాడీకేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యా విధానం పటిష్టపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని దేవరాంపల్లి, అల్లీపూర్‌తో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రారంభ బాల్య సంరక్షణ విద్యా విధానం(ఈసీసీఈ డే) కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశ పెట్టిన ప్రీ ప్రైమరీ విద్యా విధానంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ విద్య చిన్నారులకు ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు వీణ, శివరాణి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలతరెడ్డి, కమలాదేవి, మణిమాల, రజితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణలో భాగంగా 2025–26 సంవత్సరానికి సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి పరమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళల సన్నకారు రైతులకు ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగిన మహిళలకు 50శాతం సబ్సిడీపై పరికరాలు అందిస్తారని, ఐదు ఎకరాలపైబడిన వ్యవసాయ భూమి కలిగిన రైతులకు 40శాతం సబ్సిడీ ద్వారా పరికరాలను అందిస్తామని అన్నారు. దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్‌కి సంబంధించిన పరికరాలు కావలసిన వారు ట్రాక్టర్ ఆర్‌సీ పేపర్‌లు జతచేయాలని అన్నారు. దరఖాస్తులను వ్యవసాయ విస్తర్ణ అధికారులు రేపటి(సోమవారం) నుంచి దరఖాస్తులు తీసుకుంటారని అన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు


ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు



వాజేడు: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నాలుగో రోజు గణపతి దేవుడికి ప్రత్యేక పూజలను అర్చకుడు యల్లాప్రగఢ నాగేశ్వర్‌రావుశర్మ నిర్వహించారు. గణపతి మండపాల వద్ద అష్టోత్రనామాలతో పుష్పార్చలను చేశారు. అనంతరం బొడ్రాయి, సాయిబాబా, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో మండపాల వద్ద సందడి నెలకొంది.

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రుల మంటపాల వద్ద శనివారం రాత్రి భక్తుల ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దగొళ్లగూడెం గ్రామంలో కోరం రాఘవేంద్రరావు సావిత్రి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

- డీఎస్పీ రవీందర్

ములుగు రూరల్: యువత సేవా కార్యక్రమాలలో ముందుండాలని డీఎస్పీ రవీందర్ అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించిన ఆయన హాజరై ప్రారంభించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వినాయక్, వెంకటేష్, శ్రావణ్, కిషోర్, రంజిత్, రాహుల్, ప్రదీప్, సందీప్, వంశీ, జశ్వంత్, నవీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్

అసైన్డ్ భూములపై బిల్లు ప్రవేశపెట్టాలి

- అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహేందర్

వెంకటాపురం(ఎం): అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేసి హక్కులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నేరవేర్చేందు కోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి రైతులకు హక్కులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న ఇప్పటివరకు అసైన్డ్ భూముల ప్రస్తావనే లేదన్నారు. అసైన్డ్ రైతులకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. వర్షాకాల సమావేశాల్లో అసైన్డ్ భూములపై రైతులకు శాశ్వత హక్కులు కల్పించే విధంగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేలా మంత్రి సీతక్క చొరవచూపాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి, నాయకులు కుర్ర రవి, కాడపాక రాజశేఖర్, మోతె రమేశ్, అశోక్, దివాకర్, రవియాదవ్, రాజ్‌కుమార్, కొమురయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మహేందర్

ఉద్యోగికి విరమణ సహజం

ములుగు రూరల్: ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. శనివారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన కూరపాటి పూర్ణసంపత్‌రావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విరమణ పొందిన ఉద్యోగి దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్ణసంపత్‌రావు పదవి కాలంలో వైద్య ఆరోగ్యశాఖలో అంకితభావంతో పని చేసిన వ్యక్తి అని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, పవన్‌కుమార్, రణదీర్, డెమో సంపత్‌రావు, విజయభాస్కర్, దుర్గారావు, సాంబయ్య, గణేష్, పూజిత, అఖిల్ పాల్గొన్నారు.


పూర్ణసంపత్‌రావు దంపతులను సన్మానిస్తున్న జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు

గణేశ్ నిమజ్జనానికి డీజేలు పెట్టొద్దు

- పస్రా సీఐ దయాకర్

గోవిందరావుపేట: గణేశుడిని నిమజ్జనం చేసే సమయంలో డీజేలకు, సౌండ్ బాక్స్‌లు పెట్టొద్దని పస్రా సీఐ దయాకర్ అన్నారు. మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో డీజే యజమానులతో సీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశుని నిమజ్జానానికి తీసుకెళ్లే సమయంలో డీజేలు, సౌండ్ బాక్స్‌లు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని అన్నారు. ఎవరైనా పెడితే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సీఐ దయాకర్

గ్యానం సారయ్య ఆశయ సాధనకు కృషి

వెంకటాపురం(కె): సీపీఎం దివంగత నాయకుడు గ్యానం సారయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు బండారు రవి కుమార్, సూడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గ్యానం సారయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి సాంబశివ, నాయకులు వెంకటరెడ్డి, గ్యానం వాసు, రాజేందర్, కుమ్మరి శ్రీను, చిట్టెం ఆదినారాయణ, నర్సింహచారి ఉన్నారు.


సారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు